


టమోటా ధరలు పాతాళానికి పడిపోయాయి. దీనివల్ల సుమారు రూ.100 కోట్లకుపైగా నష్టం రైతులకు వాటిల్లినట్లు అంచనా. ఈ ఏడాది ఇతర రంగాల్లోని వ్యక్తులు కూడా టమోటా సాగు చేశారు. దీనివల్ల గతంతో పోలిస్తే ఈసారి మూడు రెట్ల సాగు విస్తీర్ణం పెరిగింది. దీనివల్ల నాణ్యత కలిగిన కాయలకు కూడా గిట్టుబాటు ధర లభించలేదు. ఈ పరిణామాలతో సామాన్య రైతు కుదేలవుతున్నాడు.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి

టమోటారా



పాతాళానికి పడిపోయిన ధరలు

సాగుదారులకు రూ.వంద కోట్లకుపైగా నష్టం వచ్చినట్లు అంచనా

ఇతర రంగాల్లోని వ్యక్తుల రాకతో భారీగా సాగు పెరగడమూ ఓ కారణం

కుదేలవుతున్న సామాన్య రైతు

టమోటా సాగు గత ఏడాది తక్కువగా ఉండింది. దీనికితోడు పలు రకాల వైరస్, ఊజీగ, ఆకుముడత, తదితర రోగాలతో పాటు సాగునీటి కొరతతో పంట దిగుబడి తగ్గింది. ఈ కారణాలతో డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్నంటాయి. దీన్నిచూసి ఈ ఏడాది కూడా రేటు భారీగా ఉంటుందని భావించిన ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధశాఖల అధికారులు, వ్యాపారులు, ధనవంతులైనవారు టమోటా సాగువైపు మొగ్గుచూపారు. పోటీపడి సాగు చేయడంతో విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడీ అధికంగా వచ్చింది. సాధారణంగా ఎకరానికి 30 టన్నుల దిగుబడి వస్తుంది. మోతాదు మించి ఎరువులు వాడకం, కర్రలు కట్టడంతో దిగుబడి బాగా పెరిగింది. ఎకరాకు రూ.3లక్షలకుపైగా పెట్టుబడి పెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా పంట అమ్ముదామనుకునేసరికి ధరలు భారీగా పడిపోయాయి. ఇతర రంగాల్లోని వారి మాటెలా ఉన్నా సామాన్య రైతు మాత్రం దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో పంటను పొలాల్లోనే చాలామంది వదిలేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ధరలిలా..

ఫిబ్రవరి నుంచి టమోటా కిలో ధర అత్యధికంగా రూ.13 చొప్పున నాలుగురోజులు మాత్రమే పలికింది. మిగిలిన రోజుల్లో రూ.10 నుంచి రూ.5 వరకు పలికింది. ఆదివారం పుంగనూరు వ్యవసాయ మార్కెట్‌కు 888.18 మెట్రిక్ టన్నులు సరుకు రాగా మొదటి రకం టమోటా కిలో రూ.9, రెండో రకం రూ.8.40, మూడో రకం కిలో రూ.8 ధర పలికింది.

సాగు వివరాలు : జిల్లాలో పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గంలో టమోటా అత్యధికంగా సాగైంది. సాధారణ సాగు 1550 హెక్టార్లు ఉండగా ప్రస్తుతం దాదాపు 3వేల హెక్టార్లు సాగు చేశారు. పుంగనూరు మండలంలో గతంలో 1000 ఎకరాల్లోపు సాగు ఉండగా, ప్రస్తుతం 3,500 ఎకరాల్లో సాగైంది. అలాగే సోమలలో 2,500, చౌడేపల్లెలో 2,000, రొంపిచెర్లలో 1,500, పెద్దపంజాణిలో 1,500, పులిచెర్ల, సదుం మండలాల్లో 600 ఎకరాల చొప్పున సాగు చేశారు.

వేలం వెర్రిగా సాగు చేయడంతోనే నష్టాలు

జిల్లాలో ఈఏడాది రైతులతోపాటు ఇతర రంగాల్లోని వ్యక్తులు ప్రవేశించి వేలంవెర్రిగా టమోటా సాగు చేశారు. దీనివల్ల అత్యధికంగా దిగుబడి వచ్చి.. ధరల్లేక నష్టాలు వచ్చాయి. బయట ప్రాంతాల్లోనూ టమోటా సాగు పెరిగింది. దాంతో జిల్లాకు బయట ట్రేడర్లు రావడంలేదు. చిత్తూరులోని రెండు ఫ్యాక్టరీలవారు మాత్రం కిలో రూ.5 చొప్పున తీసుకుంటున్నారు. ఇకనైనా రైతుల్లోనూ మార్పు వచ్చి.. ఇతర పంటలపైనా దృష్టి పెట్టాలి.

- మధుసూదన్‌రెడ్డి, చిత్తూరు హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల రాకతో నష్టపోయాం



ఈసారి ఎక్కడి నుంచో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు భారీగా పొలాలు తీసుకుని, మనుషులను పెట్టి పంట సాగు చేశారు. దిగుబడి ఎక్కువగా వచ్చింది. దీనివల్ల డిమాండ్ తగ్గడంతో అసలైన రైతులం తీవ్రంగా నష్టపోయాం. నేను ఎకరం పొలంలో రూ.2లక్షలు ఖర్చు చేసి మూడు (అదున్లు) విడతలుగా టమోటా సాగు చేశాను. దిగుబడి బాగా వచ్చినా ధరల్లేక.. కూలీల ఖర్చులు కూడా రాలేదు.

- చెంగల్రాయప్ప, రైతు, బి.కదిరేపల్లె

కష్టం మిగిలింది



సాగు విపరీతం కావడంతో టమోటా నారు విక్రయించే నర్సరీ యజమానులు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అంగడి వాళ్లు మాత్రం బాగుపడ్డారు. గిట్టుబాటు ధర వస్తుందని ఆశగా ఎదురుచూసినా ప్రయోజనం లేకపోయింది. రైతులకు నష్టంతోపాటు కష్టం మిగిలింది.

- రెడ్డెప్పరెడ్డి, రైతు, బిల్లేరు

కూలీల ఖర్చులూ రాలేదు



మంచి ధరలు వచ్చి గతంలో చేసిన అప్పులు తీర్చుకుందామని ఎంతో కష్టపడి టమోటా సాగు చేశారు. కానీ ఈ సీజన్‌లో గిట్టుబాటు ధర పలకలేదు. కూలీల ఖర్చులూ రాలేదు.

- నాగరాజ, రైతు, సోమల



బయట రాష్ట్రాల్లోనూ పెరిగిన పంట

పుంగనూరు మార్కెట్ నుంచి శ్రీకాకుళం, వైజాగ్, అనకాపల్లె, కోల్‌కత్తా, రాయపూర్, చెన్నై, ఒడిశా, తమిళనాడు ప్రాంతాలకు టమోటాలు ఎగుమతి అవుతాయి. బయట రాష్ట్రాల్లో కూడా పంట పెరగడంతో అక్కడ డిమాండ్ లేక ధరలు తగ్గిపోయాయి.



పుంగనూరు మండలం చదళ్ల వద్ద పొలాల్లోనే వదిలేసిన టమోటాలు

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్‌ఎస్'

చిత్తూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులంతా ఉదయం తొమ్మిది గంటలకే హాజరుకావాలని కోరారు. దీంతోపాటు నియోజకవర్గ, మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఆయా అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ.. : జిల్లా పోలీసు కార్యాలయంలోనూ పీజీఆర్‌ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి ఆదివారం మూడు గంటల సమయం పట్టింది. ఆలయానికి ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి వెలుపలకు వ్యాపించాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో పెంచలకిషోర్ చర్యలు చేపట్టారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



చిన్నారులను మింగిన నీటికుంట

అయ్యో..!

- ఆటలే 'ముంచేశాయి'
- నీటికుంటలో పడి ముగ్గురు చిన్నారుల మృతి



చిన్నారుల మృతదేహాలు

కుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): జోరుగా కురుస్తుండిన వాన అప్పుడే వెలిసింది. అంతే ఇళ్ల నుంచి బయటికెళ్లి ఆటలు మొదలుపెట్టారో ముగ్గురు పిల్లలు. ఆ ఆటలే వారిని 'ముంచేశాయి'. నీటికుంటలో నిండిన వాన నీరు వారి ఊపిరి తీసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం మండలం దేవరాజపురంలోని చర్చి సమీపంలో ఎస్సీ సామాజిక వర్గం కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుటుంబాల్లో పక్క పక్కన ఉండే గుడిసెల్లో ఉంటున్న తిరుపతి వరలక్ష్మిల కుమార్తె గౌతమి (7), రాజ, సుమతిల కుమార్తె షాలిని (6), శరవణ, యశోదల కుమారుడు అశ్విన్ (7)లు సమీప బంధువులు. ఈ ముగ్గురు పిల్లలు కలిసే బడికి వెళ్లడం, ఆటలాడటం చేసేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచే ఈ ప్రాంతంలో వాన కురుస్తోంది. మూడు గంటలకు కాస్త తెరపి వచ్చింది. వర్షం ఆగగానే ముగ్గురూ కూడబలుక్కుని గుడిసెల్లోంచి పొలోమంటూ బయటపడ్డారు. ఆపక్కనే చర్చి, దానిని దాదాపుగా ఆనుకుని ఇటీవలనే ఏదో కట్టడంకోసం తీసిన గోతిలో నిండిన వాననీరు. ఆ నీటిని చూసి సంబరపడిపోయారు పిల్లలు. అక్కడికెళ్లి ఆటల్లో పడ్డారు. కుంటలో దిగి, ఒకరిపై ఒకరు బురద చల్లుకున్నారు. ఇంతలో కాలుజారిందో, మరేమయ్యిందో కానీ నీటికుంటలో మునిగిపోయారు. సమీపంలో ఎవరూ లేకపోవడంతో కుంటనుంచి బయటకు రాలేక, సాయం అందక ఊపిరాడక మృతి చెందారు. తర్వాత కుటుంబీకులు వారి శరీరాలకు అంటిన మట్టిని తుడిచి.. ఇళ్లలోని పాత గుడ్డలతో చుట్టి పడుకోబెట్టిన దృశ్యాలను చూసిన వారంతా కన్నీరు పెట్టుకున్నారు. ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది. విషయం తెలుసుకున్న కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, సిబ్బందితో సాయంత్రం దేవరాజపురం చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి, పిల్లల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తక్షణ సాయంగా రూ.లక్ష

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.లక్ష అందించడానికి అధికారులు ముందుకొచ్చారు. సీఎం సహాయ నిధి కింద అదనపు సాయం అందించడానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. సాయం అందించడంపై సీఎంకు, కంచర్లకు కుప్పం టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ధన్యవాదాలన్నారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు వర్షం కురిసింది. 25 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలంలో అత్యధికంగా 90.2 మి.మీ, తవణంపల్లెలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. సదుంలో 1.4, పులిచెర్లలో 4, కార్వేటినగరంలో 16.2, పెనుమూరులో 11, పూతలపట్టులో 8.2, సోమలలో 4.2, చౌడేపల్లెలో 29, పుంగనూరులో 26.2, పెద్దపంజాణిలో 35.8, గంగవరంలో 23.2, ఎస్‌ఆర్‌పురంలో 41, జీడీ నెల్లూరులో 18.2, చిత్తూరులో 7.6, పలమనేరులో 30, బైరెడ్డిపల్లెలో 23.8, వి.కోటలో 12.6. శాంతిపురంలో 20.2, గుడుపల్లెలో 3.4, కుప్పంలో 8, రామకుప్పంలో 4.6, బంగారుపాళ్యంలో 7.2, యాదమరిలో 1.2, గుడిపాలలో 6, పాలసముద్రంలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

పిడుగుపడి ధాన్యం దగ్ధం

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొండివెంగనపల్లె గ్రామ పంచాయతీ బండ మీదఇండ్లు గ్రామంలో శ్యామల ఇంటిపై పిడుగుపడింది. ఇంట్లోని సుమారు 60 బస్తాల వరి ధాన్యం దగ్ధమైందని బాధితురాలు ఆదివారం తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కాలిపోయిన ధాన్యం



గదుల కోసం సీఆర్వో వద్ద భక్తుల పడిగాపులు

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమలలో ఆదివారమూ భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవుల నేపథ్యంలో శుక్రవారం తిరుమలలో రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. యాత్రికుల క్యూలైన్లు వెలుపలకు రాకపోయినా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో మూడురోజులుగా నిండుతున్నాయి. ఆదివారం కూడా వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లు నిండి.. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది, టైంస్లాట్ భక్తులకూ దాదాపు మూడు గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతం, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, లేపాక్షి, రాంభగీచ సర్కిల్, వరాహస్వామి విశ్రాంతి భవనాల వద్ద భక్తుల సందడి ఎక్కువగా ఉంది. గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి విచారణ కార్యాలయాల ముందు భక్తులు బారులు తీరారు. గదులు దొరకని వారు ఆయా కార్యాలయాల ముందు, క్యూలైన్ల వద్ద, వసతి సముదాయాలు, షెడ్లలోనే సేదతీరారు. కేటాయించిన సమయానికంటే ముందుగానే రావడంతో స్లాటెడ్ సర్వదర్శన భక్తులతో ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ ఏరియాలోనూ రద్దీ ఉంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏనుగుల మందతో రైతుల్లో భయాందోళన

- సోమల మండలానికి చేరిన 13 ఏనుగుల గుంపు
- గజరాజుల దాడిలో ధ్వంసమైన మామిడితోటలు



రాంపల్లె వద్ద మామిడి తోటలో ఏనుగుల పాదముద్రలు

సోమల, మే 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఆవులపల్లె పంచాయతీ రాంపల్లెబీట్‌లో శనివారం రాత్రి 13 ఏనుగుల గుంపు మామిడి తోటల్లో స్వైరవిహారం చేసింది. రాంపల్లెకు చెందిన బాబురెడ్డి మామిడి తోటలో కాయలను తిని, చెట్లను ధ్వంసం చేశాయి. సమీపంలోని ఆరెకరాల టమోటా తోటల్లో ఊత కర్రలను ధ్వంసం చేశాయి. రెండు నెలల కిందట సదుం, పులిచెర్ల వైపు మళ్లిన ఏనుగులు మళ్లీ మండలంలో ప్రవేశించాయని తెలుసుకున్న రైతులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు పొలంలోకి వస్తాయోనని కంటిమీద కునుకు లేకుండా కాపు కాస్తున్నారు. ఆవులపల్లె పంచాయతీలోని రాంపల్లె బీట్, పత్రపల్లె, కొత్తూరు సమీపంలో వేలకు వేలు ఖర్చు పెట్టి సాగులోకి తెచ్చుకున్న టమోటా తోటలోని ఊత కర్రలను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. ఏనుగుల దాడితో సుమారు రూ.4 లక్షల మేర పంట నష్టం జరిగినట్లు వాపోయారు. ఏడాది కిందట కూడా ఈరైతుల పంటలనే ఏనుగులు ధ్వంసం చేయడంతో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పత్రపల్లె ప్రాంతాన్ని సందర్శించారు. సోలార్ కంచెతోపాటు ఏనుగుల దాడుల నివారణకు బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, నష్టపరిహారం పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో 13 ఏనుగుల గుంపు సంచారంపై అటవీ అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

రాత్రివేళ సంచరిస్తూ..

పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో సుమారు 4వేల ఎకరాల్లో మామిడి, 2వేల ఎకరాల్లో టమోటా సాగులో ఉంది. పదేళ్లుగా ఈ పంచాయతీల్లో ఏనుగులు మకాం వేస్తున్నాయి. అన్నెమ్మగారిపల్లె సమీపంలోని కనికలచెరువు, చిన్నఉప్పరపల్లె సమీపంలోని చెరువుకోన వద్ద అనుకూలంగా ఉండడంతో రాత్రి వేళ సంచరిస్తూ రైతులను నష్టాలపాలు చేస్తున్నాయి. ఏనుగుల దాడికి భయపడి ఈ ప్రాంత రైతులు వరి, చెరకు సాగు చేయడం మానుకున్నారు.



టమోటా తోటలో ధ్వంసమైన డ్రిప్ పరికరాలు

నేటినుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు టెన్త్ సప్లిమెంటరీతోపాటు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జనరల్ టెన్త్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. టెన్త్ జనరల్‌లో 8,765 మంది కోసం 36, ఓపెన్ స్కూల్ టెన్త్‌లో 670 మందికి 12, ఇంటర్‌లో 2,182 మంది కోసం తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 36 మంది చీఫ్ డిపార్టుమెంటల్ అధికారులు, 320 మంది ఇన్విజిలేటర్లు, కస్టోడియన్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

'పనిచేసిన ప్రతి కార్యకర్తకూ టీడీపీలో గుర్తింపు'


గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

సోమల, మే 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపుకోసం పని చేసిన ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని మండలపార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దఉప్పరపల్లెలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషిచేయాలని సూచించారు. పెద్దఉప్పరపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జి. రెడ్డెప్పనాయుడు, కార్యదర్శిగా బి. వెంకటేశ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచులు బంగారప్ప, బాలాజీ నాయుడు, సుధాకర్‌నాయుడు, మునుస్వామి, మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ



సోమల, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సైనికులకు తాము మద్దతుగా ఉంటామంటూ అమరవీరులకు వివిధ పార్టీల నాయకులు ఘన నివాళులర్పించారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులు సోమల గాంధీ విగ్రహం నుంచి జూనియర్ కళాశాల వరకు సాయుధ దళాలకు సంఘీభావం తెలుపుతూ జాతీయ జెండాలు చేతబట్టి పట్టణ వీధుల్లో ర్యాలీ జరిపారు. పుంగనూరు బీజేపీ ఇన్‌చార్జి గన్నా మదన్‌మోహన్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు హేమగిరి, టీడీపీ అధ్యక్షుడు పీవీ. శివశంకర్, ఉపాధ్యాయనేత జ్యోతీశ్వరుడు, సీజీ. రెడ్డెప్ప, శ్రీరాములు, నగేశ్, నరేంద్రగుప్తా, అభిషేక్, నవీన్, అశోక్, రాయల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో ఘనంగా ముత్యాలమ్మ జాతర



రొంపిచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని భక్తులు కలిసి జాతరలో పాల్గొని పూజలు చేశారు. పొంగళ్లుపెట్టారు. అమ్మవారికి నిమ్మకాయల హారాలు వేసి చీరసారెలు సమర్పించారు. అర్చకులు గుణశేఖర్ సుగంధద్రవ్యాలతో మహాభిషేకం, అర్చనలు జరిగాయి. భక్తులకు మంగళ హారతులిచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చెంచమరెడ్డిగారిపల్లె టీడీపీ గ్రామకమిటీ ఎన్నిక


గుర్తింపు కార్డుల పంపిణీలో ఉయ్యాలరమణ

రొంపిచెర్ల,మే 18 (ఆంధ్రజ్యోతి):చెంచమరెడ్డిగారిపల్లె గ్రామ టీడీపీ కమిటీ అధ్యక్షుడిగా రామూర్తినాయుడు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా దేవులపల్లె చంగల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాలరమణ తెలిపారు. ఆదివారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికైన నాయకులు పార్టీ ఎదుగుదలకు, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘునాద్, గూడూరుహరిబాబు, మనోజ్‌కుమార్, మాధవరావు, చంద్రశేఖర్‌ఆచారి, ఈశ్వర, రెడ్డెప్పనాయుడు, మురళీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, మే18(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ సామాజిక చెందిన విద్యార్థి జేమ్స్‌ని కొంతమంది విద్యార్థులు నిర్బంధించి మూత్రం తాగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మునీంద్రనాయక్ మాట్లాడుతూ దళిత విద్యార్థిని ఇబ్బంది పెట్టిన వారిపై కఠినంగా వ్యహరించాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, నాగ, భాస్కర్, ఈశ్వర్, వెంకటరమణ, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు



పుంగనూరు రూరల్, మే18(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను స్థానిక జనసేన నాయకులు ఆదివారం తెనాలిలో కలిశారు. నియోజకవర్గంలోని గ్రామీణ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గంపై డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చిస్తామని మంత్రి చెప్పారన్నారు. త్వరలోనే పర్యటిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, చైతన్యరాయల్, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, నరేశ్‌రాయల్, నాగభూషణం, హరినారాయణ, రఘు, పాముల హరి, చిన్నా, జావిద్, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

వైభవంగా ఇలావంతుని వధ



గుడుపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): యామగానిపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఇలావంతుని వధ ఘట్టం జనరంజకంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ధర్మరాజుల మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయం ఎదుట బంకమట్టితో ఇలావంతుడి భారీ రూపాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద గద, కిరీటంతో మహోగ్ర రూపంలో శత్రుమూకలపైకి దూకుతున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం ముందు నాటకాన్ని ప్రదర్శించారు. తరువాత ఇలావంతుడి రూపాన్ని దహన ఘట్టాన్ని పూర్తి చేశారు. రాత్రి ద్రౌపదిని ఆలయ వీధుల్లో ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేసింది.


ఇలావంతుని వధ ఘట్టం చూసేందుకు వచ్చిన ప్రజలు

21న రొంపిచర్ల మండల మీట్

రొంపిచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో ఈనెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్యసమావేశం జరగనుంది. ఎంపీపీ చిచ్చిలిపురుషోత్తంరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రొంపిచెర్ల -తిరుపతి మధ్య బస్సు సౌకర్యం

రొంపిచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి వినతి మేరకు పుంగనూరు నుంచి రొంపిచెర్ల మీదుగా తిరుపతికి, అలాగే పుంగనూరు నుంచి మాడి బైరెడ్డిపల్లె, వి కోట, శాంతిపురం, కుప్పానికి బస్సు సౌకర్యం కల్పించినట్లు పుంగనూరు డిపో మేనేజరు సధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రోజూ సాయంత్రం 4.30 గంటలకు పుంగనూరులో బయలు దేరి రొంపిచెర్ల మీదుగా తిరుపతిలో నైట్‌హాల్ట్ ఉంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 5.15 గంటలకు బయలు దేరి రొంపిచెర్ల, కల్లూరు, సోమల, పుంగనూరు మీదుగా మదనపల్లెకు వెళ్లతుందన్నారు. అలాగే కుప్పంకు వెళ్లే బస్సు ఉదయం 5.15గంటలకు పుంగనూరులో బయలు దేరి మదనపల్లెకు 5.55 చేరి 6.10 గంటలకు బయలు దేరి పుంగనూరు, మాడి, బైరెడ్డిపల్లె, వి కోట మీదుగా కుప్పంకు వెళ్లతుంది. తిరిగి కుప్పంలో 10గంటలకు బయలుదేరి అదే మార్గంలో మదనపల్లె మీదుగా పుంగనూరుకు చేరుతుందని వివరించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ


వృద్ధులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్

పుంగనూరు రూరల్, మే18(ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత తీసుకున్నపుడే జన్మకు అర్థం ఉంటుందని ఎస్‌ఐ లోకేశ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దోబీకాలనీలోని వృద్ధాశ్రమంలో రూ.12వేలు విలువ కలిగిన నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులపై ప్రేమాభిమానాలు చూపించాలన్నారు.

సల్లాపురెమ్మ ఆలయంలో దుర్గాహోమం



బైరెడ్డిపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సల్లాపురెమ్మ ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్గాహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు మునివీరయ్య, వీరభద్రయ్య, నాగేంద్రప్రసాద్ విశేషాలంకరణచేసి ప్రత్యేకపూజలు జరిపారు. కలశపూజలు, నవగ్రహ, మృత్యుంజయ, నవదుర్గాహోమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



బైరెడ్డిపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం పుష్పయాగంతో ముగిశాయి. ఈ సందర్భంగాస్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు విశేషాలంకరణ చేశాక సుగంధపుష్పాలతో పుష్పయాగోత్సవం నిర్వహించారు. శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు బైరెడ్డిపల్లె మండల సర్వసభ్యసమావేశం

బైరెడ్డిపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 20వతేది ఉదయం 10-30గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రబాలాజీ ఒకప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శాఖలవారీగా సమీక్ష జరుగుతుందన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


క్యాంపు ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

చిత్తూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ హెడ్ శైలజ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ క్యాంపు విజయవంతంగా జరిగిందన్నారు. విద్యార్థులు ఎన్నో విషయాలను నేర్చుకున్నారన్నారు. వారికి తెలిసిన వాటిని రైతులకు చక్కగా అవగాహన కల్పించారన్నారు. క్యాంపునకు సహకరించిన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో సబ్ జైలు స్థలంలో పెట్రోలు బంకు సిద్ధం


తుది దశకు చేరుకొన్న ఐవోసీ పెట్రోలు బంకు

పలమనేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దశాబ్దం క్రితం మూతపడిన సబ్ జైలు స్థలంలో ఐవోసీ ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకుకు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. పలమనేరులోని గుడియాత్రం రోడ్డు కూడలిలోని సబ్ జైలు స్థలంలో ఐవోసీ పెట్రోలు బంకు ఏర్పాటుకు జైళ్లశాఖతో ఒప్పందం కుదుర్చుకుంది ఏడాది క్రితం శంకుస్థాపన చేసింది. మిగిలిన శాఖాపరమైన చర్యల అనంతరం పెట్రోలు బంకు ఏర్పాటు పనులు ప్రారంభించారు. పెట్రోలు బంకులో డీజిల్, పెట్రోలుతో పాటు సీఎన్‌జీ గ్యాస్ కూడా విక్రయాలకు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డీజిల్, పెట్రోలు వాహనాలకు నింపేందుకు రెండు వేర్వేరు మిషన్లను ఏర్పాటు చేశారు. పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థలం కంకర వేసి తొక్కిస్తున్నారు. ఈ పనులు వారం రోజుల్లో ముగుస్తాయని, సీఎన్‌జీ గ్యాస్ కూడా ఏర్పాటు చేసి నెలాఖరులోపు పెట్రోలు బంకు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే పట్టణ నడిబొడ్డున బంకు ఏర్పాటు చేయడం వలన వాహన దారులకు అందుబాటులో ఉంటుంది. అయితే ఈ స్థలం విస్తీర్ణం అంతంత మాత్రంగానే ఉండటంతో వాహనాల రద్దీ కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పలమనేరుతో పాటు మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ పెట్రోలు బంకు 9వ బంకు కానుంది. 60వేల జనాభా ఉన్న పలమనేరులో ఇప్పటికే రెండు పెట్రోలు బంకులు ఉన్నాయి. మిగిలిన బంకులు గుడియాత్తం రహదారిలో, జాతీయ రహదారిలో ఉన్నాయి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన సర్పంచ్,సభ్యులు


పార్టీలో చేరిన సర్పంచ్, వార్డు సభ్యులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, మే 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం ముదరంపల్లెలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గ్రామదేవత పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 47 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వీరికి విడతలవారీగా పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. ముదరంపల్లెలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అమ్మరాజుపల్లె పంచాయతీ సర్పంచ్ స్వర్ణమ్మ, వార్డు సభ్యులు రెడ్డెప్ప, లక్ష్మమ్మ, కస్తూరమ్మ, శాంతమ్మలతో పాటు గ్రామానికి చెందిన గంగిరెడ్డి, సుబ్బారెడ్డి, తలారిరెడ్డెప్ప, రాజారెడ్డి, రమేష్‌రెడ్డి, మునిరత్నం, వెంకటేశులు, రమణలతో కలసి వంద మంది ఉన్నారు. వీరందరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2022లో మహానాడు సమావేశానికి వెళ్లివస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సీనియర్ నాయకుడు క్రిష్ణమూర్తి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.5 లక్షల చెక్కు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయభాస్కరరెడ్డి, నాయకులు మురహరిరెడ్డి, శ్రీరాములు,జయరాంరెడ్డి, రోజారెడ్డి, సుధాకరరెడ్డి, నాగరాజురెడ్డి, వేమారెడ్డి, నాగరాజ, చలపతి, గంగప్ప, నందకుమార్, శంకరప్ప, రెడ్డెప్ప, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు సంఘీభావ ర్యాలీ



పుంగనూరు రూరల్, మే18(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం త్రివిధ దళాలు చేసిన పోరాటం మరువలేమని మాజీ సైనికులు, ప్రజలు, రాజకీయపార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జమీందార్ ప్యాలెస్ నుంచి నగిరివీధి, తపాలకార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయం, ఇందరాసర్కిల్, ప్రయివేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా భారీ సంఖ్యలో మాజీ సైనికులు, ప్రజలు, మహిళలు, మైనార్టీలు, రాజకీయపార్టీ నాయకులు, స్వచ్ఛంధ సంస్థలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్ పేరుతో తగిన గుణపాఠం చెప్పిన త్రివిధ దళాల సైన్యానానికి ప్రజల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలు టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎం. వెంకటరమణరాజు,మాధవరెడ్డి, సీవీ రెడ్డి, పోలీస్‌గిరి, శమీపతి, రామకృష్ణమరాజు, సుబ్రహ్మణ్యంరాజు, అయూబ్‌ఖాన్, రాజారెడ్డి, ఇబ్రహీం, నరసింహులు, జగదీశ్‌రాజు, ప్రసాద్ రెడ్డి, గంగాధర్, రమణ, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులు, త్రిమూర్తిరెడ్డి, ఇనాయితుల్లా, మల్లికారాణి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


సారె తీసుకెళుతున్న దాత సుబ్రహ్మణ్యం కుటుంబంతో టెంపుల్ ఇన్‌స్పెక్టరు

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపారు. శుద్ధి, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన చేశారు. భక్తాంజనేయస్వామికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మృత్సంగ్రహణం, సేనాదిపతి తిరుమాడ వీధి ఉత్సవం, అంకురార్పణ, యాగశాల వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి 8.30 గంటల వరకు శుద్ధి, ఏకాంత సేవ జరిగింది. ఏర్పాట్లను టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, అర్చకులు, ఉద్యోగులు పర్యవేక్షించారు. ● సోమవారం నుంచి ఈ నెల 27వ తేది వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. 19వ తేదీన ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 20న చిన్నశేష వాహనం, హంస వాహనం, 21 సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 22న కల్పవృక్ష వాహనం, ఆర్జిత కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం సేవలు ఉంటాయి. 23న మోహినీ అవతారం, గరుడ వాహనం, 24న హనుమంత వాహనం, గజ వాహనం, 25న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 26న రథోత్సవం, అశ్వవాహనం, 27న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సారె తీసుకొచ్చిన దాత

ధ్వజారోహణ కార్యక్రమానికి అవసరమైన గరుడ పతాకం, కొడితాడు, గరుడ పటమునక వంటి వస్త్రాలు, ఇతర పూజా సామగ్రిని కార్వేటి నగరానికి చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్ కుటుంబీకులతో కలసి వచ్చి టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్‌కి అందజేశారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం


సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే భాను

నింద్ర, మే 18 (ఆంధ్రజ్యోతి): అత్తూరు గ్రామ పంచాయితీలో జరుగుతున్న ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని పాండువుల దేవతామూర్తులకు అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశా. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు ఏడు గ్రామ సరిహద్దుల్లో స్నానమాచరించి ద్రౌపదిదేవి వెంట వచ్చి గోవిందనామ స్మరణతో భక్తులు అగ్ని గుండం ప్రవేశం చేశారు. ఉభయదాతలుగా కమ్మవారి సాఫ్ట్ యూత్(అత్తూరు), మధ్యాహ్నం విశ్వనాథం, రెడ్డి సంఘం అన్నదానం చేశారు. నగరి రూరల్ సీఐ భాస్కర్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే భాను ప్రకాష్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు నాయకులు వెంకటేశ్వరరావు గాలి రమేష్‌నాయుడు, గిరిబాబు, రాధాకృష్ణ రెడ్డి, పురుషోత్తం నాయుడు, ప్రసాద్ నాయుడు, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

నగరి, మే 18 (ఆంధ్రజ్యోతి): తణుకుపేట పంచాయతీలో గల ఎస్వీపురంలో ఆదివారం జరిగిన వరదరాజస్వామి కళ్యాణోత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి సారెగా చీర సమర్పించారు. తిరుమంజసం కల్యాణోత్సవంలో మెక్కులు తీర్చుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడు, సురేష్‌నాయుడు, కామేష్ వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పుంగనూరు రూరల్, మే18(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... చదళ్ల గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి కుమార్తె రజిని(18) బెంగళూరు వెళ్లేందుకు శనివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. బెంగళూరు చేరలేదని బంధువులు చెప్పడంతో ఆదివారం యువతి తండ్రి ఫిర్యాదు చేశారన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, మే18(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు... కొండమదొడ్డికి చెందిన రమేశ్ రెండేళ్ల క్రితం పుంగనూరులోని తూర్పుమొగసాలకు చెందిన మమతను వివాహం చేసుకున్నాడు. ఇతను ఆరడిగుంట రైతు సేవాకేంద్రంలో సెరికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తనను రూ.3 లక్షల కట్నం తీసుకురావాలని రమేష్ తండ్రి చంద్రప్ప, సోదరిలు నాగమ్మ, సరస్వతిలు వేధిస్తున్నట్లు మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రమేష్‌రాజు

విజయపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతార్కాడులో ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ పండేటి భూపతి రాజు ఆర్థిక సాయంతో 45 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. పాతార్కాడు, కోసలనగరం, జంబాడ, నెహ్రూనగర్ క్లస్టర్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం వాసన్ ఐ కేర్ ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతి, రవిరాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు తులాభారం



వెదురుకుప్పం, మే 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు ఆదివారం వెదురుకుప్పంకు చెందిన కౌశిక్‌రెడ్డికి తులాభారం వేశారు. దీని ద్వారా వచ్చిన రూ.2501లను ఆలయ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

1986-87లో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు 38 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో ఆదివారం కలుసుకొన్నారు.

తవణంపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులు, స్నేహితులతో కలిసి ఆడుకున్న ఆటలను గుర్తు చేసుకుంటూ 38 సంవత్సరాల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆనందంగా గడిపారు. మండలంలోని అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకొని ఆశీస్సులు తీసుకొన్నారు. చదువు అనంతరం ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి హాజరై ఆనాటి జ్ఞాపకాలను తలుచుకొంటూ సందడి చేశారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, నవీన్, కిషోర్, శివలింగం, జ్ఞానాంబ, అనిత, అమ్ములతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మూగబోయిన షార్

● గగన ప్రయాణంలో దారి తప్పిన పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్



(సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదివారం ఉదయం 5.59 గంటలు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నారింజ రంగు లేలేత పసిడి వర్ణాలతో పులికాట్ సరస్సు- బంగాళాఖాతానికి మధ్య పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది.

6.07 గంటలు: రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొని మూడో దశ ప్రారంభం కాగానే గమన వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి.

6.11 గంటలు: పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రయోగం ఇంకా పూర్తికాలేదు. వివరాలన్నీ మళ్లీ వెల్లడిస్తామంటూ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ నారాయణన్ ప్రకటించారు. లైవ్ ఆగిపోయింది.

అంతే.. ఏం జరిగిందనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ. కాసేపటికే మూడో దశలో రాకెట్ వేగం తగ్గి తన గమనాన్ని వీడి దిశ మార్చుకుని విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు నిరాశ చెందారు. ఒక్కసారిగా బాధతో కూడిన నిశ్శబ్దం ఆవరించింది.

షార్, శ్రీహరికోట సమీపంలోని సూళ్లూరుపేట, సమీప గ్రామాలన్నీ రాకెట్ ప్రయోగమని సందడిగా ఉన్నాయి. తెల్లవారు జామునుంచే అందరి కళ్లు షార్ వైపే. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా 22 గంటల పాటు కొనసాగి.. ఆదివారం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు నిర్దేశిత సమయానికే పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది. వీక్షకులతో పాటు షార్ శాస్త్రవేత్తలు, భవనాల పైకెక్కి రాకెట్‌ను చూస్తున్న వారంతా చప్పట్లు కేరింతలు కొడుతూ ఆనందంగా చూశారు. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని చూస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, సహచర శాస్త్రవేత్తలు చూస్తుండగానే రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొంది. మూడో దశ ప్రారంభమై గమనం వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి. సరిగ్గా 12 నిమిషాలకు ఇస్రో చైర్మన్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తిందని, ప్రయోగం ఇంకా పూర్తికాలేదని చెప్పారు. మరోవైపు లైవ్ ఆగింది. దీంతో అప్పటి వరకు సందడిగా ఉన్న మీడియా సెంటర్‌తో పాటు షార్ ప్రాంతమంతా నిశ్శబ్ద వాతావరణంతో మూగపోయింది. ఈ రాకెట్ ద్వారా పంపిన నిఘా నేత్ర ఉపగ్రహం నింగిలోకి పోకుండా విఫలం చెందింది. ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహ ప్రయోగం విఫలమవడం అందరినీ నిరాశ పరిచింది.

శాస్త్రవేత్తల్లో తీవ్ర నిరాశ

ప్రయోగం విఫలమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి మీడియా సెంటర్‌కు వచ్చి చెప్పారు. ఇప్పటి వరకు సాలిడ్ మోటారు మూడో దశలో చిన్నపాటి లోపం కూడా తలెత్తలేదు. భారీ ఉపగ్రహాలు, ఒకేసారి 103 ఉపగ్రహాలను కూడా పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అలవోకగా అంతరిక్షంలోకి పంపి విజయకేతనం ఎగురవేశారు. అలాంటిది కీలకమైన దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగంలో ఎందుకిలా జరిగిందని తలలుపట్టుకుంటున్నారు. జనవరిలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. మూడు రోజుల తరువాత ఉపగ్రహం నుంచి సంకేతాలు అందలేదు. దీంతో ఆ ప్రయోగం పాక్షిక విజయంగానే మిగిలింది. ఇప్పుడు 101వ ప్రయోగం సాంకేతిక సమస్య తలెత్తి విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు తీవ్ర నిరాశ చెందారు.

ప్రయోగాన్ని తిలకించిన పార్లమెంటరీ కమిటీ

పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగాన్ని పార్లమెంటరీ స్థాయి కమిటీ సభ్యుల బృందం తిలకించింది. ఏడుగురితో కూడిన ఈ సభ్యుల బృందం శనివారం రాత్రి శ్రీహరికోటలోనే బసచేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగం కావడంతో వీరు ఆసక్తిగా తిలకించారు. ప్రయోగం విఫలమైందని తెలిసి.. వీరు శాస్త్రవేత్తల భుజం తట్టి అభినందిస్తూ లోపాన్ని సరిచేసి మరో ప్రయోగాన్ని విజయవంతం చేయాలని ప్రోత్సహించారు.



మిషన్ కంట్రోల్ నుంచి రాకెట్‌ను చూస్తున్న రేంజ్ ఆపరేషన్ శాస్త్రవేత్తలు



రాకెట్ గమనం తప్పడంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఇస్రో చైర్మన్ నారాయణన్, పక్కనే షార్ డైరెక్టర్ రాజరాజన్

పలమనేరు బాలాజీకి సడ్లపల్లి పురస్కారం



పలమనేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సడ్లపల్లి సాహితీ పురస్కారానికి పలమనేరుకు చెందిన రచయిత బాలాజి ఎంపికయ్యారు. ఆయన విరచితం ఏకలవ్య కాలనీ కథాసంపుటి ఈ పురస్కారం కింద ఎంపిక చేసినట్లు చెందిన సడ్లపల్లి సాహితీ సంస్థ నిర్వాహకులు సడ్లపల్లి చిదంబరం రెడ్డి(హిందూపురం) తెలియజేశారు. ఈ సందర్భంగా పలమనేరుకు చెందిన రచయితలు ఆదివారం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2.2 కిలోల గంజాయి స్వాధీనం: విక్రేత అరెస్టు

ఐరాల, మే 18 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల చిత్తూరు-పీలేరు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న గుండ్లపల్లె ఎస్టీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఆదివారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి 2.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఐరాల ఎస్ఐ నరసింహులు తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి ఆమెను పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేశారు.

సీనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేంద్రరెడ్డిపై విశ్రాంత ఎంపీడీవో కనకరాజులు నాయుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మాజీ జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డికి సీసీగా ఉన్న సమయంలో 48 మంది ఉద్యోగుల ఎస్ఆర్‌లు దాచి పెట్టి ఇబ్బంది పెట్టాడని, జడ్పీ కార్యాలయంలోని అన్ని సెక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అనధికారికంగా మానిటరింగ్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే టైప్ రైటింగ్ పాస్ కాకుండానే ప్రమోషన్లు పొందాడని, జడ్పీకి సంబంధించిన ఫైళ్లు దాచిపెట్టి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశాడని డిప్యూటీ సీఎంకు, సీఎంవోకు, పీఆర్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు.

రూ.2.40లక్షల విలువైన నెక్లెస్ చోరీ

బంగారుపాళ్యం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీ సత్రానికి చెందిన భవిత అత్తగారిల్లు అయిన కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు కేజీ సత్రం నుంచి ఈనెల 15వ తేదీన బస్సులో బయలుదేరింది. ఈ క్రమంలో తనతో పాటు తీసుకొచ్చిన బంగారు నెక్లెస్‌ను బ్యాగ్‌లో భద్రపరిచింది. మార్గమధ్యంలో బంగారుపాళ్యం వచ్చాక బ్యాగ్‌లో పరిశీలించగా అందులో రూ.2.40 లక్షల విలువైన 30 గ్రాముల నెక్లెస్ కనిపించలేదు. ఈ విషయాన్ని బస్ కండక్టర్‌కు తెలిపి పరిశీలించగా నెక్లెస్ ఆచూకీ దొరకలేదు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మైనర్లు బైకులు నడిపితే.. తల్లిదండ్రులను జైలుకు పంపుతాం

● డీఎస్పీ సాయినాథ్ హెచ్చరిక

చిత్తూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మైనర్లు బైకులు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టి జైలుకు పంపుతామని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వంద మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి జరిమానా విధించారు. మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల చిత్తూరులో జరుగుతున్న ప్రమాదాల్లో మైనర్లే అధికంగా ఉన్నారని గుర్తుచేశారు. వీరిలో చాలామంది మరణించారని, ఇంకొంత మంది కాళ్లు, చేతులు విరిగిపోయి మంచాలకే పరిమితమయ్యారన్నారు. పిల్లలపై ఉన్న ప్రేమతో తల్లిదండ్రులు వాహనాలను ఇస్తున్నారని, చివరకు వారే బాధపడాల్సి వస్తోందన్నారు. సీఐలు మహేశ్వర్, నెట్టికంఠయ్య, ఎస్ఐలు రమేష్‌బాబు, మల్లికార్జున్, సుగుణ, ఏఎస్ఐ లోకనాథం, పోలీసులు పాల్గొన్నారు.



మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సాయినాథ్

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



చౌడేపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించాక భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 25వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవల టికెట్ల ద్వారా ఒక్కరోజే రూ.12లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. ఈవో ఏకాంబరం భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అశ్వవాహనంపై అలరారిన ముత్తుమారెమ్మ

కుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముత్తుమార్మెకు అశ్వవాహన సేవ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అభిషేకాలు, విశేష పూజలందుకున్న గంగమ్మ అమ్మవారి చెంతనే కొలువైన ముత్తుమారెమ్మకూ ఆయా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి విద్యుద్దీప కాంతుల నడుమ ముత్తుమారెమ్మ అశ్వవాహనంపై ఊరేగి భక్తుల కర్పూరనీరాజనాలు అందుకున్నారు. అమ్మవారి అగ్నిగుండ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరగనుంది. దీనికి మూడు రాష్ట్రాలనుంచి భారీగా భక్తులు తరలివస్తారు. అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా పుష్పపల్లకి, గరిగె, సయ్యాండి, బాణ వేడుకలు జరుగుతాయి.



బియ్యం లారీ బోల్తా

● రేషన్ బియ్యమని స్థానికుల ఆరోపణ
● కాదంటున్న అధికారులు



కుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పరిధిలోని ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులో ప్రమాదవశాత్తూ బోల్తా పడిన బియ్యం లారీపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మంకలదొడ్డి పంచాయతీ శెట్టిగానిగుట్ట సమీపంలో బియ్యం లోడ్ లారీ శనివారం రాత్రి 10 గంటలకు బోల్తా పడింది. గ్రామస్తులు లారీ వద్దకు వచ్చి విచారించారు. లారీలో సుమారు 30 టన్నుల మేర బియ్యం బస్తాలున్నాయని, అవన్నీ రేషన్ బియ్యమేనని వారు ఆరోపిస్తున్నారు. తహసీల్దారుకు వారు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదివారం ఉదయం వీఆర్వోను సంఘటన జరిగిన ప్రాంతానికి విచారణకు పంపించారు. పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బంగారుపేటనుంచి చెన్నై పోర్టుకు బియ్యం రవాణా చేస్తుండగా బోల్తా పడిందని డ్రైవర్ వారికి చెప్పారు. తహసీల్దారును వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామన్నారు. బియ్యాన్ని సాంకేతిక తనిఖీకోసం పంపుతామన్నారు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్యను వివరణ కోరగా, కర్ణాటక నుంచి తమిళనాడు చెన్నై పోర్టుకు లారీలో బియ్యం రవాణా అవుతోందని చెప్పారు. బిల్లులు కూడా ఉన్నాయన్నారు. అందువల్ల కేసు నమోదు చేయలేదన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న బాలాజి

చిత్తూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం. ఇందుకోసం ఈనెల 21వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈవో కార్యాలయాన్ని, 23న రాష్ట్ర విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడిని విజయవంతం చేయడానికి టీచర్లు కలిసి రావాలి' అని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ పిలుపునిచ్చారు. డీఈవో కార్యాలయం ముట్టడి కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణల కారణంగా విద్యారంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటిని అరికట్టి కేవలం మూడంచెల వ్యవస్థ (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు) ఉండేలా కృషి చేయడంతోపాటు హేతుబద్ధీకరణ, బదిలీల కారణంగా నష్టపోతున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ముట్టడి కార్యక్రమాలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెంగల్రాయ మందడి, ఆప్టా జిల్లా అధ్యక్షుడు మునాఫ్, నాయకులు ముక్తార్, గోవిందస్వామి, మునీర్, ముత్యాలరెడ్డి తదితరుల సలహాలు, సూచనలు తీసుకుని కార్యాచరణ రూపొందించారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాను బాస్కెట్ బాల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

● శాప్ చైర్మన్ రవి నాయుడు
● ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు
● బాల, బాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జయకేతనం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

యాదమరి, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాను బాస్కెట్ బాల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లి పీఈఎస్ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం ఫైనల్స్ జరగ్గా.. బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు జయకేతనం ఎగురవేశారు. ● బాలుర విభాగం ఫైనల్స్‌లో అనంతపురం 34 పాయింట్లు సాధించగా, తూర్పు గోదావరి 38 పాయింట్లతో ట్రోఫీని కైవసం చేసుకుంది. ● బాలికల విభాగం ఫైనల్స్‌లో చిత్తూరు 20 పాయింట్లు సాధించగా, తూర్పు గోదావరి 39 పాయింట్లు సాధించి ట్రోఫీ గెలుచుకుంది. విజేతలకు శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెంగల్రాయ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, టెక్నికల్ కమిటీ ఏపీ చైర్మన్ సురేష్, కార్యదర్శి చక్రవర్తి, డీఎస్డీవో బాలాజీ తదితరులు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ అబ్జర్వర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వైవీ కృష్ణబాబు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్టు

పూతలపట్టు, మే 18 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులోని రెండిళ్లలో చోరీకి పాల్పడిన నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సాయినాథ్ ఆదివారం మీడియాకు వివరాలు తెలిపారు. ఈనెల ఐదో తేదీన పూతలపట్టులోని జయరాం నాయుడు, ఆయన పక్కనే ఉన్న ఇందుమతి ఇళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ తమ సిబ్బందితో రంగంపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. టీఎన్87 డీ3448 నెంబరు గల కారును ఆపగా, ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు వెంబడించి కారును ఆపి, అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లాకు చెందిన యువరాజు, మురుగన్, మధురై జిల్లాకు చెందిన రాజు, చెన్నైకి చెందిన శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు పూతలపట్టులో చోరీకి పాల్పడిన దొంగలుగా తేలడంతో నలుగురిపై కేసు నమోదుచేశారు. వారి వద్ద నుంచి 216 గ్రాముల బంగారు నగలు, 650 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించారు. కేసును త్వరగా ఛేదించిన పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ సాయినాథ్

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ టెస్టులు: పీఆర్‌టీయూ



మోడల్ టెస్టు పరీక్షల పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చిత్తూరు సెంట్రల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత మోడల్ టెస్టులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కన్నన్ తెలిపారు. ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయంలో మాదిరి పరీక్షల నిర్వహణ పోస్టర్‌ను విడుదల చేశారు. త్వరలోనే మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం చిత్తూరు జిల్లాలో కన్నన్ (91777 27435), విజయ్‌భాస్కర్ రెడ్డి (99854 85453), నరేంద్రరెడ్డి (94947 49373), తిరుపతి జిల్లాలో శ్రీనివాస్ యాదవ్ (95738 01873), సదాశివన్ (99087 29818), తుకారాం (94904 53001)లను సంప్రదించాలన్నారు. పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సాధన చేయాలి

● ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభోత్సవంలో క్యాడెట్లకు కల్నల్ సూచన



ఎన్‌సీసీ క్యాంపులో మాట్లాడుతున్న కల్నల్ నోయల్ వివేక్ మోనిస్

చిత్తూరు సెంట్రల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతి అంశంలోనూ క్రమశిక్షణతో సాధన చేయాలని 35వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ క్యాంపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 10 రోజుల పాటు నిర్వహించే క్యాంపులో జిల్లాలోని 540 మంది క్యాడెట్లకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథమ్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, శ్రీలత, చిరంజీవి, యుగంధర్, ధనంజయులు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరునాళ్ల

● అమ్మ వారి సేవలో ఎమ్మెల్యే భాను, మాజీ మంత్రి రోజా



ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత

విజయపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురంలో ఆదివారం కనకదుర్గమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, మాజీ మంత్రి రోజా, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికారప్రతినిధి చినబాబు, సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత కొండూరు అశోకరాజు కనకదుర్గమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే భానును, చినబాబును టీడీపీ నాయకులు, మాజీ మంత్రిని వైసీపీ నాయకులు పూలమాల, శాలువతో సత్కరించారు. మండలంలోని మహారాజపురంలో గ్రామ దేవత నారాయణమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తవణంపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులు, స్నేహితులతో కలిసి ఆడుకున్న ఆటలను గుర్తు చేసుకుంటూ 38 సంవత్సరాల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆనందంగా గడిపారు. మండలంలోని అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు 38 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో ఆదివారం కలుసుకొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకొని ఆశీస్సులు తీసుకొన్నారు. చదువు అనంతరం ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి హాజరై ఆనాటి జ్ఞాపకాలను తలుచుకొంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, నవీన్, కిషోర్, శివలింగం, జ్ఞానాంబ, అనిత, అమ్ములతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు సమష్టిగా ఉండాలి



టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు

విజయపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు సమష్టిగా ఉండాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపురంలో హనుమాన్ ఆలయ ఆవరణలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తకు సమస్య వచ్చినప్పుడు విషయం తెలుసుకొని నాయకుడు పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర, నాయకులు మునిభాస్కర్‌రాజు, బాలాజీ నాయుడు, గుణశేఖర్‌రెడ్డి, వాసు నాయుడు, సుధాకర్‌రాజు, కొండూరు దాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వజ్రాలపురం గంగమ్మజాతర



మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, క్రిష్ణప్ప

బంగారుపాళ్యం, మే 18 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె పంచాయతీ వజ్రాలపురంలోని బోయకొండ గంగమ్మ జాతర వార్షికోత్సవంలో భాగంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ,క్రిష్ణప్పలు ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు కలశస్థాపన,ధ్వజారోహణ,గణపతి హోమం, చండీహోమం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెలంగాణ మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాసగౌడ్, మండల టీడీపీ అధ్యక్షుడు ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, ఐరాల, పూతలపట్టు, యాదమరి, తవణంపల్లె మండలాలకు చెందిన టీడీపీ అధ్యక్షులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణప్ప, రాధమ్మ, కొమ్మినేని ఉషానరేష్, పురుషోత్తం, గోపి, నాగరాజ్ గౌడ్, శివలింగయ్య, అట్లూరి వేణుగోపాల్, రామ్మూర్తి నాయుడు, రాజేంద్ర నాయుడు, సుబ్బా నాయుడు, మురళీ, శంకరయ్య, తులసీ, ఎల్లప్ప పాల్గొన్నారు.

డీకేచెరువులో కార్డన్ సెర్చ్

యాదమరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అటవీ సమీప గ్రామమైన దిగువకణతల చెరువులో ఆదివారం ఉదయం ఎస్ఐ ఈశ్వర్, అటవీ శాఖ అధికారులతో కలిసి ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 65 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, నాలుగు ట్రాక్టర్ల రికార్డులను తనిఖీ చేసి సరైన డాక్యుమెంట్లు లేని మూడు టూవీలర్లను సీజ్ చేశారు. సైబర్ క్రైం నేర నిరోధాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో మోహనమురళి, ఎఫ్‌బీవో శంకర్, పోలీసులు పాల్గొన్నారు.

గాలివానకు కూలిన కోళ్ల షెడ్డు

యాదమరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ధాటికి కోళ్ల షెడ్డు గోడలు కూలిపోయి, రేకులు ధ్వంసమయ్యాయని రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సంతో మండల పరిధిలోని పత్రపల్లి గ్రామానికి చెందిన పట్టాభి బ్రాయిలర్ కోళ్ల షెడ్డు కూలిపోయింది. దీంతో తనను ఆదుకోవాలని పట్టాభి తహసీల్దార్ పార్థసారథికి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

● నాలుగు రోజులుగా కొమరగుంట, మాంబేడు పంచాయతీ ప్రజలకు తప్పని ఇబ్బందులు

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో నాలుగు రోజులుగా అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నామని కొమరగుంట, మాంబేడు గ్రామ పంచాయతీల ప్రజలు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను కార్వేటినగరం ఏడీఈ చంద్రబాబు నిరంతరాయంగా చేస్తూనే ఉన్నారని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు ముందుకు కదలడం లేదని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని ప్రజలు హెచ్చరించారు.

టీడీపీ నేతకు సన్మానం



దొరబాబును సన్మానిస్తున్న ఈసీపల్లి గ్రామస్తులు

పూతలపట్టు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దొరబాబు చౌదరిని ఎర్రచెరువుపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఇంద్రసేన నాయుడు, నాయకులు మురళి, ఏకాంబరం, బాబు, వినాయకం, నరేంద్ర, సోము, విజయ్, కృష్ణమూర్తి, బాలకృష్ణ, నాగయ్య, చిన్నరెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు



తల్లిదండ్రులకు, మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, మే 18 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వానాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సీఐ శ్రీనివాసులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురు మైనర్లు రాష్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వీరి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, ఇస్తే అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీకెమరాల ద్వారా గుర్తించి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రమేష్‌రాజు

విజయపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతార్కాడులో ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పండేటి భూపతిరాజు ఆర్థిక సాయంతో 45 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. పాతార్కాడు, కోసలనగరం, జంబాడ, నెహ్రూనగర్ క్లస్టర్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం వాసన్ ఐ కేర్ ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతి, రవిరాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయ ఈవోగా వెంకటేశులు



నగరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రముఖ దేశమ్మ ఆలయం ఈవోగా వెంకటేశులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

బంగారమ్మకు తులాభారం



తులాభార కార్యక్రమంలో కొప్పేటి ప్రసాద్ తదితరులు

వెదురుకుప్పం, మే 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు ఆదివారం వెదురుకుప్పంకు చెందిన కౌశిక్‌రెడ్డికి తులాభారం వేశారు. దీని ద్వారా వచ్చిన రూ.2501లను ఆలయ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

23 నుంచి నెల్లేపల్లెలో మహాభారత ఉత్సవాలు

గంగాధరనెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం వద్ద ఈ నెల 23 నుంచి మహాభారత ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు 15 రోజుల పాటు జరుగుతాయి. నెల్లేపల్లె పంచాయతీలోని 16 గ్రామాలకు చెందిన పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో 67 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 68వ సంవత్సరం మహాభారత ఉత్సవానికి సోమవారం ఉదయం శ్రీకారం కొడి పూజలు చేయనున్నారు.

నైనేరమ్మ వార్షిక మహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం మండలం డేరాకండ్రిగ సమీపంలో ఉన్న నైనేరమ్మ ఆలయ వార్షిక మహోత్సవాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని కార్య నిర్వాహకులు నిర్ణయించారు. ఆదివారం ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో జూన్ 8వ తేదీన వార్షిక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

గంగినేనిచెరువు పార్కులో చిన్నారులకు భద్రత ఏది...?



గంగినేనిచెరువు పార్కుకు సరైన కంచె ఏర్పాటు చేయకపోవడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో కంచె పైకి ఎక్కుతున్న చిన్నారులు, కంచె దాటి లోపలికి దిగిన బాలుడు

ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో చిత్తూరు నగరంలోని గంగినేనిచెరువు పార్కు నిత్యం చిన్నారులతో రద్దీగా ఉంటోంది. చెరువులోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కంచె తక్కువ ఎత్తుగా ఉండడంతో చిన్నారులు కంచెను దాటి నీటిలో ఆడుకోవడానికి వెళుతున్నారు. అక్కడ క్షణం ఏమారినా చిన్నారులు ఆ నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు పార్కుకు సెక్యూరిటీ సిబ్బంది కూడా లేకపోవడంతో చిన్నారులు కంచెను దాటి లోపలికి వెళుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజల్లో పాల్గొన్న ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, అర్చకులు - కుటుంబ సభ్యులతో సారె తీసుకెళుతున్న దాత సుబ్రహ్మణ్యం

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఏర్పాట్లను టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, అర్చకులు, ఉద్యోగులు పర్యవేక్షించారు. ఈనెల 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు.

సారె తీసుకొచ్చిన దాత: బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమానికి అవసరమైన గరుడ పతాకం, కొడితాడు, గరుడ పటమునక వంటి వస్త్రాలు, ఇతర పూజా సామగ్రిని కార్వేటినగరానికి చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్ కుటుంబీకులతో కలసి వచ్చి టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్‌కి అందజేశారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అలరించిన దుర్యోధన వధ



అంతిమంజేరిలో, గొడుగుమానుపల్లిలో దుర్యోధన వధ ప్రదర్శన

పాలసముద్రం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతిమంజేరి గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. పాండవులు, ద్రౌపది విగ్రహాలకు ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం దుర్యోధన వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్యోధనుడు, భీముడు పాత్రధారులు మహాభారతంలోని దుర్యోధన వధ ఘట్టంలోని పద్యాలు పాడుతూ రక్తి కట్టించారు. ఈ నెల 9న ప్రారంభమైన ధర్మరాజుల తిరునాళ్ల ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. ఆలయ ధర్మకర్త వెంకటరమణరాజు ఆధ్వర్యంలో ప్రతి రోజు భక్తులకు అన్నదానం చేశారు.

గొడుగుమానుపల్లిలో ...

పెనుమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగుమానుపల్లి ద్రౌపదీ సమేత ధర్మరాజ ఆలయం వద్ద ఆదివారం దుర్యోధన వధ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉభయదారులుగా పులికల్లు మాజీ సర్పంచ్ లక్ష్మీపతి, విజయమ్మ దంపతులు వ్యవహరించారు. ధర్మకర్త హరిప్రకాష్‌వర్మ, గ్రామ పెద్దలు జగన్నాథరెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీల ఎన్నిక



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం నలగాంపల్లెలోని మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ ఫామ్‌హౌస్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణిప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండల టీడీపీ ఉపాధ్యక్షులుగా కే.లోకేష్‌రెడ్డి, లోకనాథనాయుడు,కేశవులు, ప్రధాన కార్యదర్శులుగా జనార్దన్ గౌడ్, సుదర్శన్‌నాయుడు, మండల తెలుగు మహిళా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాధిక, సెల్వి, ప్రధాన కార్యదర్శిగా దేవయాని, తెలుగుయువత అధ్యక్షుడిగా బాలసుబ్రమణ్యం నాయుడు,వైస్ ప్రెసిడెంట్‌గా తిలక్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జీలుగా కోకా ప్రకాష్‌నాయుడు, మోహన్‌నాయుడు, రమేష్, మండల కోశాధికారిగా జి.రవీంద్రనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రవి,బాలక్రిష్ణ, కుమార్‌రాజా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా స్వామిదాస్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉమాపతి, వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా మాధవ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా రవితేజ, సోషియల్ మీడియా ప్రతినిధి మణి, యూనిట్ ఇన్‌చార్జీలుగా జయరామిరెడ్డి, రవి, రమణ, మంజునాథ్, శ్రీనివాసులు, గిరిబాబు, బాలక్రిష్ణమ నాయుడు, టికే హరిప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోదండయాదవ్, ఎన్పీ శ్రీనివాసులునాయుడు, హేమచంద్ర నాయుడు, బీసీ రవీంద్ర నాయుడు, నాగరాజగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



విశేషాలంకరణలో ద్రౌపదిదేవి అమ్మవారు - అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

నింద్ర, మే 18 (ఆంధ్రజ్యోతి): అత్తూరు గ్రామ పంచాయితీలో జరుగుతున్న ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని పాండవుల దేవతామూర్తులకు అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశా. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు ఏడు గ్రామ సరిహద్దుల్లో స్నానమాచరించి ద్రౌపదిదేవి వెంట వచ్చి గోవిందనామ స్మరణతో భక్తులు అగ్ని గుండం ప్రవేశం చేశారు. ఉభయదాతలుగా కమ్మవారి సాఫ్ట్ యూత్(అత్తూరు), మధ్యాహ్నం విశ్వనాథం, రెడ్డి సంఘం అన్నదానం చేశారు. నగరి రూరల్ సీఐ భాస్కర్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే భాను ప్రకాష్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు నాయకులు వెంకటేశ్వరరావు గాలి రమేష్‌నాయుడు, గిరిబాబు, రాధాకృష్ణ రెడ్డి, పురుషోత్తం నాయుడు, ప్రసాద్ నాయుడు, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

చిత్తూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ హెడ్ శైలజ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ క్యాంపు విజయవంతంగా జరిగిందన్నారు. విద్యార్థులు ఎన్నో విషయాలను నేర్చుకున్నారన్నారు. వారికి తెలిసిన వాటిని రైతులకు చక్కగా అవగాహన కల్పించారన్నారు. క్యాంపునకు సహకరించిన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

నగరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తణుకుపేట పంచాయతీలో గల ఎస్వీపురంలో ఆదివారం జరిగిన వరదరాజస్వామి కల్యాణోత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి సారెగా చీర సమర్పించారు. తిరుమంజనం, కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడు, సురేష్‌నాయుడు, కామేష్ వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడిన యూనిట్ సిబ్బంది

చిత్తూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగుల ఆత్మశాంతి కోసమే నగరంలో జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఈ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో రవికుమార్, యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శెట్టిరామాపురంలో గంగమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న టీడీపీనేతలు

గంగాధరనెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిరామాపురంలో గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని అంబోధరపల్లె పంచాయతీ శెట్టిరామాపురం గ్రామానికి చెందిన టీడీపీనేతలు లక్ష్మణ్‌రెడ్డి, వెంకటేశులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జయచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలోని గంగమ్మకు అర్చకులు అభిషేక, హోమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, బాబు నాయుడు, మోహన్ నాయుడు, నరసింహులు నాయుడు, వెంకటాచలం నాయుడు, స్వామిదాస్, దేవసుందరం, వైసీపీ నేతలు వెంకటేశులురెడ్డి, ఉమామహేశ్వరి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్ఆర్‌పురం అధ్యక్ష పదవికి పోటీ

శ్రీరంగరాజపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి పోటీ నెలకొంది. ప్రస్తుతం ఓసీ సామాజిక వర్గానికి చెందిన గంధమనేని జయశంకర్ నాయుడు మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి ఇస్తే ప్రధానంగా కటికపల్లెకు చెందిన కె.ఎం.రవి ఆశిస్తున్నారు. ఓసీ సామాజిక వర్గానికి చెందిన గంధమనేని రాజశేఖర్‌నాయుడు, మునివర్ధనాయుడు, వేమ నాయుడు, పైనేని మురళి, జ్యోతి ప్రకాష్ బరిలో ఉన్నారు. వీరంతా ఇప్పటికే ఎమ్మెల్యే థామస్‌కు తమ కోరికను తెలియజేసినట్లు సమాచారం. బీసీ సామాజిక వర్గానికి చెందిన శేఖర్ కూడా పోటీ పడుతున్నారు. ప్రధానంగా టీడీపీ అధ్యక్ష పదవిపై మండలంలోని పార్టీ నాయకుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొందన్న చర్చ జరుగుతోంది. చివరకు ఈ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

నేడు నగరిలో మినీ మహానాడు

నగరి, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరిలోని ఏజేఎస్ కల్యాణమండపంలో సోమవారం మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఐదు మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సమావేశం



యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నూతన కార్యవర్గంతో ఆ వర్గ నేతలు

వెదురుకుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని కానగలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం యాదవ ఎంప్లాయిస్ సొసైటీ(వైఈఎస్) జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు జోగి గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో కార్వేటినగరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో యాదవుల అభివృద్ధిపై చర్చించారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభకనపరిచిన విద్యార్థులకు, ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు చేయూతనివ్వాలని నిర్ణయించారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ అధ్యక్షులు జోగి గురుమూర్తి యాదవ్ తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడిగా వార్తాల మోహన్‌మురళి యాదవ్, అధ్యక్షుడిగా ఎద్దల వాసు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా భీమారావు యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా వేణుగోపాల్ యాదవ్, మహిళా అధ్యక్షురాలుగా బంగారమ్మను ఎన్నుకున్నట్లు చెప్పారు.